# అపస్వరం

పెళ్ళి ఆహ్వానం వచ్చింది. పెళ్ళికి వెళ్ళలేదు. రాధకి చాక్‌లేటు కలర్ సిల్కు-చీర అంటే ఎంతో యిష్టం, బజారు అంతా వెతికి మామిడి అంచు జరీచీరకొన్నాను. కానుకతో పెళ్ళి ఇంటికి వెళ్ళాను. లలితకి తెలుసు నేను ఆరోజు వస్తానని-గుమ్మంలో ఎదురిచూస్తూ వుంటుందనుకున్నాను. దూరంనించే గుండెదడతో గుమ్మమంతా వెతికాను. లలిత కనపడలేదు. దడముందుగా పరిగెత్తుతున్నది. వెనకాల కాళ్ళువడిగా నడుస్తున్నాయి. గుమ్మందాటాను. రాధ, చాక్‌లేటు కలర్ సిల్కు-చీరతో ప్రత్యక్షమైంది.

"చీర బాగుంది కదూ?"

రాధకళ్ళు అందంగా చిరునవ్వు నవ్వుతున్నాయి.

నేను జవాబు చెప్పలేదు. రాధ అందాన్ని కళ్ళతో పుణుకుతున్నాను. చూపుపాదాల మీదినుంచి క్రమంగా పైకివెళ్ళింది. మొహంలో తృటికాలం నిలిచింది. అందులో జీరకనపడింది.

"లలిత ఏదని" నా ఆందోళన కళ్ళలో ప్రతిబింబించకండా జాగ్రత్త పడుతూ అడిగాను.

"కూర్చో! ఇప్పుడే పిలుచుకొస్తా?"

లోపలికి వెడూతూ రాధ ఎందుకో చప్పున వెనక్కి-మళ్లీ సన్నగా నవ్వింది. మెరుపువేగంతో, వెంటనే లోపలికి వెళ్లింది.

నేను తెచ్చిన చాక్‌లేటు కలర్ సిల్కు-చీర నాపక్కన సోఫాలో నవ్వింది. జీవితంలో ఎక్కడో జీరవచ్చిందనుకున్నాను. కళ్లు గోడలీన్ని, గదిలోని పటాల్నీ వెదుకుతున్నాయి. పటాల మీదనించి చూపులు జారిపో

తున్నాయి. ఎక్కడా అనడంలేదు. గదిగోడలు, పటాలు నాచుట్టు తిరుగుతున్నాయి. కళ్లుగట్టిగా మూసుకున్నాను. ఇంతలో ఏదో అలికిడి అయింది. కళ్లు తెరిచేసరికల్లా రాధ, లలిత గదిలో వున్నారు.

“నేను టీ చేసి తీసుకవస్తాను. ఇంతలో మీరు ఇద్దరూ మాట్లాడుతూ వుండండని,” రాధ తిరిగి లోపలికి వెళ్లింది.

అనాలోచితంగా లభించిన ఆ ఏకాంతానికి, ముప్పైమూడుకోట్ల దేవతలకి కృతజ్ఞత తెలుపుకున్నాను.

“పెళ్లికి రాలేదేం అని లలిత ప్రశ్నించింది.

“నేనిచ్చిన పుస్తకం చదివావా?” అని నేను లలితను ఎదురు ప్రశ్నించాను. జవాబుకోసం, శరీరమే కాలంగా మార్చుకొని ఎదురు చూసాను.

“చదువలేదని” లలిత ఎందుకో ఆందోళనపడుతూ, ముక్తసరిగా సమాధానం చెప్పింది.

నేను ఎదురు చూస్తున్న సమాధానం రాలేదు. “పుస్తకంలోని నేను వ్రాసిన వుత్తరం ఏమైనట్టు” అని హృదయం గడియారానికిమల్లె దడదడ కొట్టుకుంటున్నది.

“కారణం?” జీవితమే ప్రశ్నగా మారి అడిగింది.

“పుస్తకం ఎక్కడో పోయింది”

“ఉత్తరం చదువుకున్నావా?” ప్రపంచంలోని వేగమంతా నా ప్రశ్నలో ధ్వనించింది.

“చదివాను. కాని పెళ్లి అయిన మరునాడు”

బజారులో కార్లూ, సైకిళ్లు తిరిగి ప్రశాంతంగా నడుస్తున్నట్లు తోచింది.

"మరి జవాబు"

మళ్లీ నరాలు టెన్షన్‌లోకి వచ్చాయి.

"మీరిచ్చిన పుస్తకం టేబిల్ పైన విప్పకుండా పడేసాను ఆ సాయంత్రం చదువుకోవడానికి తిరిగి టేబుల్ పైన వెతికితే కనపడలేదు. రాధ తీసుకొనివుంటుందని, రాధగదిలోకి వెళ్ళాను. గదిలో నాన్న, రాధ, రాధ పెళ్లిని గూర్చి మాట్లాడుతున్నారు. నేను చప్పున వెనక్కి తిరిగి వచ్చేసాను"

"పెళ్లంటే కోప్పడే రాధ పెళ్లికి ఎలా ఒప్పుకుంది?"

"రాధ ఎవరినో ప్రేమించింది అతను రాధను ప్రేమించలేదు. ఆ సంగతి రాధకి తెలియడం తోనే, తాను కలకాలం నుంచీ అసహ్యించుకుంటున్న వ్యక్తిని పెళ్లిచేసుకోడానికి నిశ్చయించుకుంది."

"మరి నా ఉత్తరం?"

"పెళ్లి మర్నాడు, రాధనాకుతీసుకొచ్చి చూపించింది."

"మరి జవాబు?" నాకు అనాదిప్రశ్న నిలిచింది.

"ఉత్తరంవల్ల రాధ జీవితంలో జీర ఏర్పడింది. అందువల్ల ఒక నిశ్చయానికి రావడానికి సాహసించలేక పోతున్నాను.

"శరీరంపైన నాకు వందబిందెల చన్నీళ్లు పోసినట్లైంది. నెమ్మదిగా సోఫాలోంచి లేచి గుమ్మందారి పట్టాను. ఇంకా గుమ్మం ఖాళీగానేవుంది.

"నేను అందంగా లేనా?" అని ఖాళీ గుమ్మం జీరపోయిన కంఠంతో ప్రశ్నించింది.

18.6.98